క్లుప్తంగా

పారదర్శకంగా డ్వాక్రా రుణాల చెల్లింపులు

అల్లవరం: స్త్రీ నిధి, ఉన్నతి ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు ప్రతినెలా రుణాలను పారదర్శకంగా చెల్లించే ప్రక్రియను డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో గూడాల గ్రామంలో బుధవారం చేపట్టారు. అల్లవరం మండల మహిళా సభ్యులు, యానిమేటర్ అనురాధ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, రుణ చెల్లింపులు చేసి లబ్ధిదారులకు రసీదులు అందించారు. ఇకనుంచి లబ్ధిదారులు బ్యాంకులకు వెళ్లకుండా, పేటీఎం ద్వారా రుణాల చెల్లింపులు చేయవచ్చని ఆమె తెలిపారు. దీనివల్ల లబ్ధిదారులను మోసం చేసే ఆస్కారం ఉండదని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వేలాయుధన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) లెక్చరర్, ఇంగ్లిష్ లెక్చరర్ బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఆఫీసు పనివేళల్లో ఈ నెల 20లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.

చతుర్థశాంతి యమధర్మ స్థూపానికి విరాళాలు

అమలాపురం టౌన్: ప్రతి నెలా బహుళ చతుర్థశి తిథిలో సమవర్తి యమ ధర్మరాజు పూజా మహోత్సవంతో పాటు చతుర్థశాంతి యమధర్మ స్థూపంలో జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తున్నట్టు గౌతమ మహర్షి అక్షయ పాత్ర నిర్వాహకులు తెలిపారు. ఏటా నరక చతుర్థశికి మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ఇది పూర్ణ దీక్షాపరులు పరానంద నాథ పర్యవేక్షణలో జరుగుతుంది. క్రతువు నిర్వహించే ఆదిశేష నిలయంలో రూ.1.50 లక్షలతో నిర్మించే చతుర్థశాంతి యమధర్మ స్థూపానికి రూ.85 వేల విరాళాలందాయి. జాస్తి భూపాల్ రూ.50 వేలు, సలాది వలీబాబు, సత్య శిరీష దంపతులు రూ.25 వేలు, గారపాటి శేఖర్, పంజా భోగిరాజు రూ.5 వేల వంతున విరాళాలు ఇచ్చినట్టు అక్షయ పాత్ర ప్రతినిధి పోతురాజు రామకృష్ణారావు తెలిపారు.

నూతన కార్యవర్గం



సంఘ నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ది కోనసీమ ఆటో కన్సల్టెన్సీ సంఘ సమావేశం స్థానిక యెండూరి ప్లాజాలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అబ్బిరెడ్డి సత్య శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా చిక్కం గణేష్, కోశాధికారిగా గంధం శ్రీను, ఉపాధ్యక్షునిగా బసవా సింహాద్రి, గౌరవాధ్యక్షునిగా ఆకుల దొరబాబు ఎన్నికయ్యారు. మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగసతీష్, మున్సిపల్ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి, వంకాయల చిన్నా, మామిడిపల్లి నాని పాల్గొన్నారు.

తాగునీటి నిర్వహణపై అవగాహన ఉండాలి

యానాం: గృహిణులు తాగునీటి నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ అరుణ్‌ప్రకాశం అన్నారు. బుధవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక దరియాలతిప్పలో రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద జరిగిన జల్ దివాలి–ఉమెన్ ఫర్ వాటర్, వాటర్ ఫర్ ఉమెన్ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాటర్ ట్రీట్‌మెంట్ల సందర్శన, సురక్షిత తాగునీరు, నాణ్యత తదితర అంశాలను మహిళలకు వివరించడం కార్యక్రమ ముఖ్యోద్దేశమన్నారు.

నేడు సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ

అల్లవరం: మండలంలోని సచివాలయాల్లో చేస్తున్న సంక్షేమ బోర్డుల కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు కోరారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తాడికోనలో గురువారం ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గోవలక్ష్మి

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీలో సుమారు రూ.56 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ కామాడి గోవలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. గాడిమొగ హైస్కూల్ వద్ద రూ.14.40 లక్షలతో గ్రావెల్ రోడ్, రూ.5.56 లక్షలతో గ్రావెల్ లెవెలింగ్, రూ.3.76 లక్షలతో ధనమ్మతల్లి ఆలయం వద్ద గ్రావెల్ లెవెలింగ్, రూ.6.66 లక్షలతో మార్కెట్ వద్ద సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణం, రూ.5 లక్షలతో స్నానాలరేవు అభివృద్ధి, రూ.5.4 లక్షలతో సీసీ రోడ్, డ్రైన్, గోపాలపురం నుంచి హైస్కూల్ వరకు రూ.7.15 లక్షలతో మెటల్ రోడ్, రూ.9 లక్షలతో గాడిమొగ మెయిన్ రోడ్ నుంచి కమ్యూనిటీ హాల్ వరకు సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.

అన్నం పరబ్రహ్మం

- అయ్యప్ప మాలధారులకు నిత్య అన్నదానం
- భక్తుల సేవలో తరిస్తున్న ఆసు సోదరులు
- 17 ఏళ్లుగా మాలధారణ

ముమ్మిడివరం: నల్లని దుస్తులు, మెడలో మణిహారం, నుదుటన చందనం, నోట శరణ ఘోష, శీతల స్నానం, భూతల శయనంతో ఆసు మాణిక్యాలరావు, నాగరాజు స్వాములు అందరికీ సుపరిచితులే. పదిహేడేళ్లుగా అయ్యప్ప స్వామి భక్తిలో ఈ ప్రాంత అయ్యప్ప స్వామి మాలధారణ స్వాములకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారు మాలధారణ చేసినప్పటి నుంచి ఏటా మురమళ్లలో అయ్యప్ప స్వామి పీఠం ఏర్పాటు చేసి మండల దీక్ష పరిపూర్ణం అయ్యే వరకు అను నిత్యం మురమళ్ల పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 250 మంది భక్తులకు ఉచిత అన్నదానం(భిక్ష) చేస్తున్నారు.

స్వామివారి సేవలో..

ఐ.పోలవరం మండలం కొమరగిరికి చెందిన ఆసు మాణిక్యాలరావు, నాగరాజ సోదరులు మురమళ్లలో సెల్ పాయింట్, ట్రాన్స్‌పోర్టు వ్యాపారాలు చేస్తున్నారు. పదిహేడేళ్ల క్రితం పెద్దిరెడ్డి బుజ్జి గురుస్వామి వద్ద మాలధారణ చేసి, అప్పటి నుంచి ఏటా స్వామివారి మాలాధారణ చేసి మండల దీక్ష అనంతరం శబరిమల సన్నిధికి వెళుతున్నారు. ఈ ఏడాది మురమళ్ల మార్కెట్ సెంటర్‌లో వ్యాపార సముదాయాలను నిర్మించి, పైఅంతస్తులో అయ్యప్ప పీఠం ప్రతిష్ఠించారు. సుమారు 50 మందికి మాలధారణ చేశారు. వందలాది మంది మాలధారులకు నిత్య అన్నదానం చేస్తున్నారు.



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న మాణిక్యాలరావు, నాగరాజుస్వాములు

ఏటా అన్నదానం

ఏటా అక్టోబరు తొలి వారంలో అయ్యప్ప మాలధారణ చేస్తారు. అప్పటి నుంచి దీక్షా సమయంలో 41 రోజుల పాటు అనేక మంది అయ్యప్ప భక్తులను చేరదీసి, స్వామివారి పడి పూజ, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. దీక్షా సమయంలో ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాల్లోని వందలాది భక్తులకు అన్నదానం (భిక్ష) చేస్తున్నారు. దాతలు ఇచ్చే బియ్యం, కూరగాయలతో పాటు వ్యయ ప్రయాసలకోర్చి అన్నదానం చేస్తున్నారు. దీక్షానంతరం రెండు బస్సుల్లో అయ్యప్ప భక్తులను శబరిమల తీసుకువెళతారు.

ఎంతో తృప్తి ఇస్తోంది



అయ్యప్ప భక్తులకు మాలధారణ చేయించి, దీక్షా సమయంలో అన్నదానం(భిక్ష) సమకూర్చడం మా జీవితానికి ఎంతో తృప్తినిస్తోంది. దాతలు, అయ్యప్ప భక్తులు ఇస్తున్న సహకారం మరువ లేనిది.

– ఆసు మాణిక్యాలరావు స్వామి, అన్నదానం నిర్వాహకులు, మురమళ్ల

స్వామి సేవలో తరిస్తున్నాం



ఏటా అయ్యప్ప మాలధారణ చేసి అయ్యప్ప స్వామి సేవలో తరించడం సంతృప్తిగా ఉంది. అయ్యప్ప భక్తులకు అన్నదానం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఏటా ఇలాగే అన్నదానం చేస్తూ స్వామి కృపకు పాత్రులవుతాం.

– ఆసు నాగరాజు స్వామి, అన్నదాన నిర్వాహకులు, మురమళ్ల

రెండో విడత పరిహార జాబితాకు చర్యలు

అత్యవసర సమావేశంలో సీఎం రంగసామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు ఓఎన్‌జీసీ మంజూరు చేసిన వేట నష్టపరిహారం పంపిణీకి సంబంధించిన తొలి జాబితా లబ్ధిదారులతో పాటు, అర్హులైన మరికొందరితో కూడిన రెండో జాబితానూ విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం రంగసామి స్పష్టం చేశారు. బుధవారం సీఎం రంగసామి ఆధ్వర్యంలో అసెంబ్లీ సెక్రటరియేట్‌లో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఫిషరీస్ మంత్రి లక్ష్మీనారాయణ, కలెక్టర్ వల్లవన్, ఫిషరీస్ సెక్రటరీ నెడుంజలియన్ తదితరులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తొలివిడత విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో కొందరు అనర్హులు ఉన్నట్టు అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, వారి పేర్లు సైతం ఉన్న రెండో జాబితా విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. లబ్ధిదారులు తమ పేర్లు జాబితాలో సరిచూసుకోవాలని, లేకపోతే మత్స్యకారశాఖ అధికారులను అడగాలని కోరారు. కొందరు తమ ఉనికి చాటుకోవడానికి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పరిహారం కోసం ఎవరి వద్దకూ తిరగాల్సిన పనిలేదని, అర్హులైన వారందరికీ పరిహారం అందుతుందని స్పష్టం చేశారు.



సమావేశంలో సీఎం రంగసామితో పాటు ఎమ్మెల్యే అశోక్, మంత్రి లక్ష్మీనారాయణ

నేటి నుంచి మంత్రి విశ్వరూప్ పర్యటన

23వ తేదీ వరకూ 'వై ఏపీ నీడ్స్ జగన్'

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో చేసిన సంక్షేమాభివృద్ధిని, ప్రజలకు చేర్చిన లబ్ధిని మరోసారి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వివరిస్తారని పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాల ద్వారా అమలాపురం పట్టణంలో గురువారం నుంచి ఈ నెల 23 వరకూ మంత్రి విశ్వరూప్ వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారని చెప్పారు. వార్డు సచివాలయాల వద్ద 'మా నమ్మకం నువ్వే జగనన్న' బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 9న మెట్ల కాలనీ, 10న వంటెద్దు వీధి, 14న కల్వకొలను వీధి, 15న అశోక్‌నగర్, 16న మహిపాల వీధి, 17న మద్దాలవారిపేట, 20న గొల్లగూడెం, 21న సూర్యనగర్, 22న వడ్డిగూడెం, 23న ఏవీఆర్ నగర్‌లో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఆయా కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మాణిక్యం కుటుంబానికి నగదు అందజేస్తున్న శంకరనారాయణ

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పక్షులపుంత ప్రాంతానికి చెందిన లంకా మాణిక్యం(41) మరణించడంతో తక్షణసాయంగా రూ.10 వేల నగదును పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ బుధవారం అందజేశారు. వైఎస్సార్ బీమా కింద మట్టిఖర్చుల కోసం రూ.10 వేలను మాణిక్యం కుమార్తె గంగాభవానికి అందజేశామని, మిగిలిన మొత్తాన్ని బ్యాంక్‌లో జమ చేయనున్నట్టు తెలిపారు. మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డిబాబు, సచివాలయ సిబ్బంది టేకుమూడి వేణుగోపాల్, బండారు శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న శ్రీనివాసరాజు

తాళ్లరేవు: కిడ్నీ వ్యాధి బాధితురాలికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు ఆర్థికసాయం అందజేశారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి సత్యశ్రీకి శస్త్ర చికిత్స కోసం రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆమె నిరుపేద కుటుంబానికి చెందినది కావడంతో వైద్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరాజు ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేల నగదును అందజేశారు. ఆయన వెంట ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, శీలం శ్రీను ఉన్నారు.

అన్ని స్థానాల్లో బీఎస్పీ పోటీ

అమలాపురం టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి తెలిపారు. స్థానిక ఎర్ర వంతెన వద్దనున్న డీఎస్ఎస్ ఫంక్షన్ హాలులో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు అధ్యక్షతన బుధవారం సాయంత్రం జిల్లా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి పరంజ్యోతి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై పార్టీ శ్రేణులతో చర్చించారు. పార్టీ మూడు జిల్లాల ఇన్‌ఛార్జి బత్తుల లక్ష్మణరావు, రాష్ట్ర నాయకుడు కొల్లాబత్తుల సత్యం, జిల్లా నాయకులు కాండ్రేగుల నరసింహ, కాశి లక్ష్మీభవాని, కోలా త్రిమూర్తులు పాల్గొన్నారు.

నేడు శెట్టిబలిజ నేత సూర్యనారాయణ విగ్రహావిష్కరణ

అమలాపురం టౌన్: శెట్టిబలిజ సామాజిక వర్గ అభివృద్ధికి పాటుపడిన దివంగత నేతలను స్మరించుకోవడం మన బాధ్యత అని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఇందులో భాగంగా అమలాపురం వడ్డిగూడెం రోడ్డులో సుబ్బారాయుడు చెరువు వద్ద నిర్మించిన దివంగత శెట్టిబలిజ నేత, మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కుడుపూడి సూర్యనారాయణ విగ్రహాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం సాయంత్రం ఆవిష్కరిస్తారని వెల్లడించారు. స్థానిక హైస్కూలు సెంటరులోని శెట్టిబలిజ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడారు. అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా 1954లో బాధ్యతలు చేపట్టి, ఆ తర్వాత ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా వ్యవహరించిన సూర్యనారాయణ.. శెట్టిబలిజల సామాజిక అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఓసీల్లో ఉన్న శెట్టిబలిజలను చట్టసభల్లో పోరాడి బీసీల్లో చేర్చేలా చేశారని చెప్పారు. విద్యావంతుడైన తన తాతయ్య సూర్యనారాయణ విగ్రహాన్ని అమలాపురంలో ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. సమావేశంలో శెట్టిబలిజ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్, వైఎస్సార్ సీపీ నాయకుడు వేగిరాజు సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ వివరాలు చెబుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

మూడో రోజుకు ఎన్ఎంఆర్‌ల దీక్షలు

యానాం: యానాం ప్రజా పనుల శాఖ (పీడబ్ల్యూడీ)లో 13 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాల పెంపుదల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శాఖ కార్యాలయం వద్ద ఎన్ఎంఆర్‌లు చేస్తున్న రిలే దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా 1,500 మంది ఉన్నామని, గతంలో రూ.మూడు వేల జీతంతో ప్రారంభించామని చెప్పారు. ఇప్పటికీ వేతన స్కేలు అమలు చేయడం లేదని, తమను పర్మినెంట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సీనియారిటీ ఇవ్వాలని, ఎంటీఎస్ పోస్టులను భర్తీ చేయాలని, రోజువారీ వేతనం రూ.852 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలకు సంఘీభావంగా స్థానిక నాయకులు మేడిశెట్టి లోవరాజు, సత్యనారాయణ వంటావార్పు ద్వారా భోజనాలు ఏర్పాటు చేశారు.



పీడబ్ల్యూడీ ఆఫీసు వద్ద రిలే దీక్షలు చేస్తున్న ఎన్ఎంఆర్‌లు

విద్యా సంస్థల బంద్

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం అమలాపురంలోని విద్యా సంస్థలు బంద్ పాటించాయి. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జరిగిన ఈ బంద్‌కు విద్యార్థులు మద్దతు తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఈ బంద్‌కు సంఘీభావం తెలిపాయి. విశాఖ ఉక్కు కాపాడాలని, ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని విద్యార్థులు ఆయా విద్యా సంస్థల ఎదుట నినాదాలు చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, జిల్లా కన్వీనర్ సాపే రమేష్, బి.ప్రతాప్, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ప్రణీత్, దొరబాబు, శంకర్ తదితరులు ఈ బంద్‌కు నాయకత్వం వహించారు.

గడప గడపకూ సంక్షేమ వరాలు

మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకూ సంక్షేమ వరాలు అందించి, రాష్ట్ర ప్రజలందరినీ అన్నివిధాలా ఆదుకుంటున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో సచివాలయం–2 పరిధిలో అధికారులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఆరా తీశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరలా ఆయననే సీఎం చేయాలని కోరారు. గ్రామంలో ప్రజలు పలు సమస్యలను విన్నవించగా, వాటిని మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బద్రిబాబ్జి, ఉప సర్పంచ్ మోకా శ్రీను, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, జగనన్న సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యిల రమణ, నాయకులు మోటూరి సత్యం కాపు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, యనమదల పల్లంరాజు, చేట్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో పథకాలను లబ్ధిదారునికి వివరిస్తున్న శ్రీకాంత్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్‌బీఐ జీఎం ప్రవీణ్ కుమార్

అమలాపురం రూరల్: ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అమరావతి జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇందుపల్లి గ్రామంలో బ్యాంకు బండారులంక శాఖ ఆధ్వర్యంలో బీసీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన జన సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళా సంఘాలకు రూ.రెండు కోట్ల రుణాల చెక్కును అందించారు. బ్యాంకు అందిస్తున్న పథకాలు, రుణాలు, బీమా సౌకర్యాలను వివరించారు. ఏ రంగం వారైనా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తే రుణాలు అందిస్తామని చెప్పారు. ఆయనతో పాటు మరో ముఖ్యఅతిథి బ్యాంకు రీజనల్ మేనేజర్ గున్నేశ్వరరావును సర్పంచ్ చొల్లంగి శివాలినీ అప్పాజీ దంపతులు, బండారులంక చీఫ్ మేనేజర్ వేణుగోపాలరెడ్డి ఘనంగా సత్కరించారు.



మహిళా సంఘాలకు రుణాల చెక్కును ఇస్తున్న ప్రవీణ్‌కుమార్

ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

కాట్రేనికోన: అమలాపురం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు జన్మదిన వేడుకలు విశాఖపట్టణంలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ సెక్రటరీ ఉచ్చుల రవికుమార్ తెలిపారు. ఆయనతో పాటు మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు ఎమ్మెల్సీ రవీంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపారు.

హెల్త్ కార్డుల అందజేత

ఉప్పలగుప్తం: ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కుంచే బుల్లియ్య కోరారు. గోపవరం పంచాయతీ కార్యాలయంలో బుధవారం పలువురికి ఈ కార్డులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా వెంకన్నబాబు, కుంచే స్వామి పాల్గొన్నారు.

మిల్క్ బాయిలర్ మహిళలపై ఫిర్యాదు

యానాం: యానాంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీ కాకుండా ఉండిపోయిన ఏడుగురు మిల్క్ బాయిలర్ మహిళలనూ, వేరే స్కూళ్లకు మార్చాలని బుధవారం రాజీవ్‌గాంధీ శానిటరీ వర్కర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు సంఘ నాయకులు తెలిపారు.

క్యారమ్స్ పోటీలు ప్రారంభం



క్యారమ్స్‌లో పోటీ పడుతున్న విద్యార్థులు

యానాం: యానాం విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్‌గేమ్స్‌లో భాగంగా బుధవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్‌లో అండర్–14, 17 విభాగాల్లో క్యారమ్స్ పోటీలు జరిగాయి. అండర్–14లో యానాం పబ్లిక్ స్కూల్, రాజీవ్‌గాంధీ హైస్కూల్ ద్వితీయ స్థానం, అండర్–17 బాలుర విభాగంలో యానాం పబ్లిక్ స్కూల్ ప్రథమ, రీజెన్సీ జూనియర్ కళాశాల ద్వితీయ స్థానాలు పొందాయి.

బాణసంచా వద్ద భద్రత ముఖ్యం

దుకాణాల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

అమలాపురం రూరల్: బాణసంచా విక్రయించే వ్యాపారులు రెవెన్యూ, పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, బాణసంచా విక్రయాల వద్ద భద్రత ముఖ్యమని ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ పేర్కొన్నారు. వీరితో పాటు అధికారుల బృందం అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను లైసెన్స్‌డ్ వ్యాపారులతో కలిసి బుధవారం పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఏర్పాట్లు ఉండాలని, అంబులెన్స్, పోలీసు అవుట్ పోస్ట్, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. షాపుల ఏర్పాటు, బాణసంచా అమ్మకాల వల్ల ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. షాపుల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని సూచించారు. ఈ బృందంలో రూరల్ సీఐ వీరబాబు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, ఫైర్ ఆఫీసర్ మరళీ కొండబాబు, తాలూకా ఎస్సై అందే పరదేశి ఉన్నారు.

బాణసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు

అమలాపురం రూరల్: దీపావళి పండగ సందర్భంగా అమలాపురం డివిజన్ పరిధిలోని అమలాపురం పట్టణంలో బాలయోగి స్టేడియంలో 11, 12 తేదీల్లో మాత్రమే బాణసంచా విక్రయించేందుకు తాత్కాలిక లైసెన్సులు పొందాలని ఆర్డీవో కేశవర్ధన రెడ్డి తెలిపారు. అమలాపురం డివిజన్‌కు సంబంధించి పదో తేదీ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణకు గడువు అని, నిబంధనల ప్రకారం సంబంధిత రసీదులు, చలానాతో దరఖాస్తులను 12 గంటల్లోగా తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలని వివరించారు. ఈ దరఖాస్తులకు పదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు లాటరీ ద్వారా నియమ నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేస్తామని ఆర్డీవో తెలిపారు.



బాలయోగి స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ తదితరులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఉప్పలగుప్తం: దీపావళి పండగకు బాణసంచా విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాణసంచా విక్రయదారులు, అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని నిర్వహించే బాణసంచా దుకాణాలు త్రిమెన్ కమిటీ గుర్తించిన చోటే ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల వద్ద ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలన్నారు. పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న దుకాణాలను నిబంధనల ప్రకారం వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వర ప్రసాద్, ఈఓపీఆర్‌డీ కేఎస్ గౌరీ కుమారి, డీటీ వైవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సుంకరపాలెంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుపై వ్యాపారులతో చర్చిస్తున్న తహసీల్దార్, ఎస్సై

సుంకరపాలెంలో దుకాణాలపై అభ్యంతరం

తాళ్లరేవు: దీపావళి బాణసంచా దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.పోతురాజు, కోరంగి ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సుంకరపాలెం, నీలపల్లి, తాళ్లరేవు, ఇంజరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసే దుకాణాలను పరిశీలించారు. సుంకరపాలెంలో ఏటా రహదారి వెంబడి ఏర్పాటు చేసే దుకాణాలను నిబంధనల మేరకు ఈ ఏడాది కుదరదని తహసీల్దార్ అభ్యంతరం తెలిపారు. సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనిపై స్థానిక నాయకులు, వ్యాపారులతో చర్చించారు. అలాగే గృహాలు, వ్యాపార సముదాయాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు.

10న డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం డిపో పరిధిలో ఆర్టీసీ ప్రయాణికుల సేవలపై శుక్రవారం ఉదయం 10.30 నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అమలాపురం డీఎం చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రయాణికులు 99592 25576 నంబరుకు కాల్ చేసి, తమ సమస్యలు తెలపవచ్చని చెప్పారు.

కాపు సంక్షేమ సేన యువజన ఉపాధ్యక్షుడిగా సతీష్

అమలాపురం రూరల్: కాపు సంక్షేమ సేన అమలాపురం నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి సత్యనారాయణ(సతీష్) నియమితులయ్యారు. ఈ ఉత్తర్వులను బుధవారం కాపు సంఘ నాయకుడు లింగోలు పండు, కోనసీమ జిల్లా యూత్ అధ్యక్షుడు కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు సాధనాల మురళి అందజేశారు.

రిఫరీ వెంకన్నకు అభినందనలు

యానాం: గోవాలో జాతీయ అథ్లెటిక్స్–2023 పోటీలకు పుదుచ్చేరి తరపున టెక్నికల్(రిఫరీ) అఫీషియల్‌గా వ్యవహరించిన శారదా ఎయిడెడ్ హైస్కూల్ పీఈటీ చింతా వెంకన్నను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందించారు. బుధవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతిని అందజేశారు.